www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 31 జనవరి 2023



## సిఐటియులో పలువురు చేరిక

**ప్రజాశక్తి-నెల్లూరు** నెల్లూరు స్టోన్ హౌస్ పేటలోని శ్రీ భగవాన్ వెంకయ్య స్వామి ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు సోమవారం సిఐటియులో చేరారు. ఈ సందర్భంగా సిఐటియు నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు మూలం రమేష్, నగర కార్యదర్శి జి నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్మిక వర్గ ప్రయోజనాల కోసం నిజాయితీగా నిలబడి పోరాడే సంఘం సిఐటియు అన్నారు. ఈ ప్రాంతంలో సిఐటియు ఒక బలమైన సంఘంగా ఉందని, కార్మికుల హక్కుల కోసం రాజీలేని పోరాటాలు చేస్తుందన్నారు. అనంతరం శ్రీ భగవాన్ వెంకయ్య స్వామి ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు ఎర్ర కండువాలు కప్పి సిఐటియులోకి ఆహ్వానించారు. ఆరుగురితో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. కన్వీనర్ గా కే మల్లికార్జున, సభ్యులుగా కె శ్రీనివాసులు, వినోద్ శ్రీను, దినేష్, వాసు ఎన్నికైనారు. సిఐటియు నగర ఆఫీస్ బేరర్ పి సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు నెల్లూరు నగర అధ్యక్షులు ఏ శ్రీనివాసులు, ఆఫీస్ బేరర్స్ బి రాజాబు, ఎం ప్రసాద్, నాయ కులు దామోదర్ రెడ్డి, దయాకర్, సుబ్రహ్మణ్యం, సుబ్బారెడ్డి, శ్రీనివాసులు ఉన్నారు.

కండువాకప్పుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మూలం రమేష్

## మున్సిపల్ కార్మికులకు ముఖహాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలి

### కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా

**ప్రజాశక్తి-నెల్లూరు** :రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన 'ఫేస్ యాప్' (ముఖ హాజరు) విధానం నుంచి మినహాయింపు ఇవ్వాలంటూ మున్సిపల్ కార్మికులు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. సోమవారం ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ (సిఐటియు అనుభందం) యూనియన్ ఆధ్వర్యంలో బారాషాహిద్ దర్గా నుంచి కార్పొరేషన్ కార్యాలయం వరకు మున్సిపల్ వర్కర్స్ ర్యాలీ నిర్వహించి అనంతరం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.పెంచలనర్సయ్య, సిఐటియు నాయకులు జి.నాగేశ్వరరావు, కిన్నెర కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఫేస్ యాప్ నుంచి మున్సిపల్ కార్మికులను మినహా యింపు ఇవ్వాలని, క్లాప్ వెహికల్స్, డ్రైవర్లకు బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల ఆర్థిక పరిస్థితిని ఆలోచన చేసి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి మున్సిపల్ కార్మికులను ముఖ హాజరు నుండి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం నగరపాలక సంస్థ కమిషనర్ కు సమస్యలను వివరించి మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. సిఐటియు రూరల్ అధ్యక్షులు కొండ ప్రసాద్, సిఐటియు నాయకులు సంపత్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కామాక్షమ్మ, దేశ మూర్తి, అశోక్, సుజాతమ్మ, చెన్నయ్య, శ్రీనివాసులు, లోకేష్ పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

నినాదాలు చేస్తున్న నాయకులు

పోలీస్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

## జోరుగా సింగిల్ నెంబర్ లాటరీ

### నివారణకు చర్యలు తీసుకోవాలి : సిపిఎం

**ప్రజాశక్తి-నెల్లూరు**

నగరంలో చాపకింద నీరులా 'సింగిల్ నెంబర్ లాటరీ' జూదం వ్యాపిస్తుందని, మూలలను పోలీసులు గుర్తించి కట్టడి చేయాలంటూ సిపిఎం నాయకులు ఎఎస్‌పి హేమవతికి వినతిపత్రం అందజేశారు. సోమవారం ఎస్‌పి కార్యాలయంలో స్పందన కార్యక్రమానికి 16వ డివిజన్ సిపిఎం కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు హాజరై సమస్యను పోలీసు అధికారులు వివరించి పరిష్కరించాలంటూ కోరారు.ఆ డివిజన్ సిపిఎం శాఖ నాయకులు ఆర్ శ్రీనివాసులు మాట్లాడుతూ 1990లో సింగిల్ నెంబర్ లాటరీ అనేకమంది ప్రాణాలు బలి కొన్నదన్నారు. మహమ్మారి వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్లపాల య్యారన్నారు. అటువంటి క్రీడను అప్పటి పోలీసు అధికారులు ఉక్కు పాదం మోపి అణిచివే యాలన్నారు. సిపిఎం నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలపై అవగాహన

**ప్రజాశక్తి-నెల్లూరు**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన పెంచేందుకు రూపొందించిన 'సిటిజెన్ ఔట్ రీచ్' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని వలంటీర్లు, వార్డు సచివాలయ కార్యదర్శులను కమిషనర్ ఆదేశించారు. ప్రతీనెలా చివరి శుక్రవారం, శనివారం సచివాలయ పరిధిలోని అన్ని కుటుంబాలను దర్శించి ప్రభుత్వ పథకాలను వివరించాలని, అర్హులైన వారికి పథకాలు వర్తించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మేనేజర్ ఇనాయతుల్లా, ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ సంపత్ కుమార్, సెక్రటరీ హేమావతి, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 'జగనన్న చేదోడు' నిధులు జమ

**ప్రజాశక్తి-నెల్లూరు**

స్వయం ఉపాధి ద్వారా జీవనం సాగిస్తున్న రజక, నాయీబ్రాహ్మణ, టైలర్స్ తదితర వృత్తిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, అందులో భాగంగానే 'జగనన్న చేదోడు' పథకంలో జిల్లాలోని 18,522 మంది లబ్ధిదారులకు రూ.18.522 కోట్ల ఆర్థిక సహాయం అందజేసిందని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పల్నాడు జిల్లా, వినుకొండ నుంచి 'జగనన్న చేదోడు పథకం' మూడో ఏడాది కింద లబ్ధిదారుల ఖాతాలోకి జమ చేసే బహత్తర కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు కలెక్టరేట్ లోని ఎస్.ఆర్ శంకరన్ హాల్ నుండి రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, కలెక్టర్ కె.వి.ఎన్. చక్రధర్ బాబు, బొందిలి కార్పొరేషన్ ఛైర్మన్ బి. కిశోర్ సింగ్, బి.సి కార్పొరేషన్ ఈడి బ్రహ్మానంద రెడ్డి, డిఆర్‌డిఎ పిడి సాంబశివారెడ్డి, జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, జగనన్న చేదోడు లబ్దిదారులు పాల్గొన్నారు. మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, కలెక్టర్ చక్రధర్ బాబుతో కలసి జగనన్న చేదోడు పథకం కింద జిల్లాలోని 18,522 మంది లబ్దిదారులకు 18.522 కోట్ల రూపాయల మెగా చెక్కును అందజేశారు.

## 'స్పందన' అర్జీల పరిష్కారానికి చర్యలు

**ప్రజాశక్తి-నెల్లూరు** :ప్రజల నుండి అందే స్పందన అర్జీల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి సకాలంలో పరిష్కరించాలని సంయుక్త కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన స్పందన కార్యక్రమాన్ని సంయుక్త కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, డిఆర్ఒ వెంకటనారాయణమ్మతో కలిసి నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను వారు స్వీకరించారు. తొలుత సంయుక్త కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్పందన కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని స్పందన అర్జీలను ఎప్పటికప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్షిస్తున్నార న్నారు. డి ఆర్ డి ఏ, మెప్మా పీడీలు కె.సాంబశివారెడ్డి, రవీంద్ర, జడ్పీ సీఈవో బి. చిరంజీవి, కె ఆర్ ఆర్ సి. ఎస్.డి.సి పూర్ణిమ, జిల్లా వ్యవసాయ అధికారి సుధాకర్ రాజు, సి పి ఓ సాలెం రాజు, డిఎంహెచ్ఓ డాక్టర్ పెంచలయ్య, డిటిసి బి చందర్ ఉన్నారు.

## నక్కల కాలువకు మరమ్మతులు చేయాలి

**ప్రజాశక్తి -వెంకటాచలం :** నక్కల కాలువకు తక్షణమే మరమ్మతులు చేయించి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పులిగొండ్ల శ్రీరాములు డిమాండ్ చేశారు. సర్వేపల్లి రిజర్వాయర్ నుంచి వెళ్లే వరద నీటి నక్కల కాలువ పూడిక తీయించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం వెంకటా చలం మండలాల రైతులు ఆవేదన యాత్ర చేపట్టారు. పులిగండ్ల శ్రీరాములు మాట్లాడుతూ వెంకటాచలం, ముత్తుకూరు మండలా ల్లోని నక్కల కాలువ మరమ్మ తులకు నోచు కోలేదన్నారు. 30 ఏళ్లకు పైగా పూడిపోయి చిన్నపాటి వర్షాలకు కాలువ పక్కన ఉన్న పొలాల్లో నీరు చేరి పొలాలు దెబ్బతిం టున్నాయన్నారు. ఇప్పటికే రైతులకు వ్యవసాయం ఎంతో భారంగా ఉంది. ఎంతో నష్టాలకి శ్రమ కోర్చి పండించిన పంటకు చివరికి గిట్టుబాటు ధర రాక నష్టాలు పాల వుతున్నారు. నక్కల కాలువ, పొలాల నుంచి వరద నీరు వెళ్లేందుకు ఊటు కాలువలను పూడిక తీయించి ప్రభుత్వం వారు రైతులను ఆదుకోవాలని ఆయన తెలిపారు. జిల్లా కార్యదర్శి గోకుల శ్రీని వాసులు, గడ్డం అంకయ్య ముత్తుకూరు మండల సిఐటి యు నాయకులు, ముత్తు కూరు మండలం వ్యవ సాయ కార్మిక సంఘం నాయకులు, ఓడూరు వెంకట కష్ణయ్య, వెంకటాచలం మండల రైతు సంఘం కార్యదర్శి, సిరాజ్ సుబ్బరామయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పులిగండ్ల శ్రీరాములు

## కుష్టు నివారణకు పటిష్ట చర్యలు : కలెక్టర్

**ప్రజాశక్తి-నెల్లూరు**

జిల్లాలో కుష్టు వ్యాధి నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు అధికా రులను ఆదేశించారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో మహాత్మా గాంధీ వర్ధంతి, అమరవీరుల దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కుష్టు వ్యాధి వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత కలెక్టర్ మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కుష్టు వ్యాధి, క్షయ వ్యాధి నివారణకు ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొం దించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పెద్ద ఎత్తున పారిశుద్ధ్య కార్యక్రమాలు, కుష్టు,క్షయ వ్యాదులపై అవగాహన కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టడంతో పాటు విరివిగా వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. తొలుతు జిల్లా క్షయ వ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్ జిల్లాలో కుష్టు, క్షయ వ్యాధి వివరాలు కలెక్టర్ కు వివరించారు.అనంతరం కరపత్రం ఆవిష్క రించారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ పెంచలయ్య, జెడ్పీ సీఈవో చిరంజీవి,డిఆర్డిఏ పిడి కె సాంబశివారెడ్డి, ఐసిడిఎస్ పిడి సౌజన్య పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

## జాతిపిత గాంధీకి ఘన నివాళి

**ప్రజాశక్తి -గుడ్లూరు**

మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గుడ్లూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మెయిన్ బజార్‌లో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహనికి సోమవారం పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్తూరి.శ్రీనివాసులు, ట్రెజరీ ఇన్నమురి.గరటయ్య, సెక్రటరీ అమర.మాల్యాద్రి, శ్రీరామ సేవసమితి సభ్యులు ఎయిర్టెల్ చిన్న, ఇన్నమురి ప్రమిల సూధకర్, గొల్ల.రాజా, రాంబాబు పాల్గొన్నారు.

గుడ్లూరులో...

**పొదలకూరు** :గాంధీ వర్ధంతి వేడుకలను మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పంచాయతీ బస్టాండు ఆవరణంలో ఏర్పాటు చేసిన సభలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాయకులు అమార్తలూరు చెంచయ్య,పొట్టి సుధాకర్, ఆకులూరు విజయ్,పిన్నెల ప్రభాకర్, తన్నీరు సురేష్ ఉన్నారు.

**ఉలవపాడు :** ఉలవపాడు జి.వి.ఎస్.ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి వేడుకలను సోమవారం నిర్వహిం చారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి. లక్ష్మీ సుధారాణి, కళాశాల చరిత్ర విభాగం అధాపకులు చొప్పర వెంకటేశ్వర్లు మాట్లాడారు.

**నెల్లూరు :** స్థానిక ఇందిరాభవన్లో జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆస్తుల పరిరక్షణ కమిటీ ఛైర్మన్, నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చేవూరు.దేవకుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైయ్యారు ఉన్నారు.

## 'పిడికిటి' జన్మదిన వేడుకలు

**ప్రజాశక్తి -కందుకూరు:** కందుకూరు పట్టణ టిడిపి మాజీ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు జన్మదిన వేడుకలు సోమవారం జరిగాయి. సూర్య బార్ అండ్ రెస్టారెంట్ ఆవరణంలో వెంకటేశ్వర్లు ఆయన స్నేహితులు, సన్నిహితులు, బార్ అండ్ రెస్టారెంట్ సిబ్బంది మధ్య కేక్ కట్ చేశారు. వెంకటేశ్వర్లకి జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. మాజీ శాసనసభ్యులు డాక్టర్ దివి శివరాం, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు నాదెళ్ల కోటేశ్వరరావు, మహర్షి శ్రీను, చదలవాడ కొండయ్య, టిడిపి నాయకులు గుర్రం మాల్యాద్రి, షేక్ రఫీ పాల్గొన్నారు.

## తల్లిదండ్రులకు కుమారుడు అప్పగింత

**తోటపల్లిగూడూరు :** అనారోగ్యంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన తమ కుమారుడు తిరిగి క్షేమంగా ఇంటికి చేరుకున్నాడు. ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న పోలీసులకు తల్లిదండ్రులు కత్ణతలు తెలిపారు. మండలంలోని వరిగొండ దేవళ్లాలమిట్ట ప్రాంతానికి చెందిన నెల్లూరు జయమ్మ, శ్రీనివాసులు కుమారుడు తరుణ్ సాయి గత కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడు తున్నాడు. తమ ఇంటి పొరుగు వారు దూషించారని మనస్థాపం చెందిన తరుణ్ సాయి కొద్ది రోజుల ఇంటి నుంచి పారిపోయాడు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ కె. ఇంద్రసేనా రెడ్డి కనిపించకుండా పోయిన తరుణ్ సాయి సమాచారాన్ని పలు పోలీసు స్టేషన్లకు చేరవేశారు. తరుణ్ సోమశిల ప్రాంతంలో వున్న సమాచారం పోలీసులకు చేరింది. సోమశిలలో ఉన్న తరుణ్ సాయిని పోలీసులు సోమవారం తల్లిదండ్రులకు అప్పగించారు. క్షేమంగా తమ వద్దకు చేరిన కుమారుడు తరుణ్ సాయి చుసి తల్లిదండ్రులు సంబరపడ్డారు. ఎ

## 'ఆక్స్‌ఫర్డ్' విద్యార్థి ప్రతిభ

**ప్రజాశక్తి -కందుకూరు** :ఈ నెల 28, 29, 30 తేదీల్లో దొనకొండలో జరిగిన 66వ రాష్ట్ర స్థాయి అండర్-17(ఎస్‌జిఎఫ్) హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొని క్వార్టర్ ఫైనల్ వరకు పోరాడి అత్యద్భుత ప్రదర్శనను కనబరిచిన కందుకూరు బిఆర్ ఆక్స్‌ఫర్డ్ ఒలంపియాడ్ స్కూల్లో 10తరగతి చదువుతున్న విద్యార్థి బెజవాడ వెంకట సాయి ధీమంత్‌ను దొనకొండ జడ్‌పిహెచ్ స్కూలు పూర్వ విద్యార్థి, కలకత్తాలోని ఐఇఎస్ డిఫెన్స్ అకాడమీ సభ్యులు పాపయ్య అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని అధ్భుత ప్రదర్శన కనపరిచిన సాయి దీమంత్‌ను బిఆర్ ఆక్సఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కర రావు, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్స్ బాల భాస్కర రావు, బెజవాడ నరేంద్ర బాబు ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

# వైసిపి అధిష్టానంపై 'కోటంరెడ్డి' అలక..!

### ఇన్‌ఛార్జిని ప్రకటిస్తారని ప్రచారం -ఫోన్ ట్యాపింగ్.. రూరల్ వైసిపిలో టెన్షన్..టెన్షన్

**ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి**

నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వైసిపి అధిష్టానంపై అలకపూనారు. రాష్ట్రంలోనే వైసిపికి బలం చేకూర్చే కార్యక్రమాలను నిర్వహిస్తున్న కోటంరెడ్డిపై వైసిపి అధిష్టానం ఇబ్బందులకు గురిచేస్తుంది. ఇటీవల ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలపై కోటంరెడ్డి బహిరంగంగా విమర్శించారు. ఈ నేపథ్యంలో ఆయన పార్టీ మారుతారని విస్తృత ప్రచారం జరిగింది. కోటంరెడ్డికి టికెట్ ఇవ్వరని, టిడిపిలోకి వెళతారని వైసిపిలో ఓ గ్రూపు ప్రచారం చేసింది. దీంతో ఇటీవల సిఎం జగన్మోహన్‌రెడ్డి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని ప్రత్యేకంగా పిలిచి మాట్లాడారు. పార్టీ టికెట్ నీదేనని ఏలాంటి అపోహలు పెట్టుకోకుండా ప్రజల్లో తిరగాలని సిఎం ఆదేశించారు. అప్పటి నుంచి కోటంరెడ్డి గడప గడపకు ప్రభుత్వ కార్యక్రమంలో తిరుగుతున్నారు. కోటంరెడ్డికి రాజకీయ ప్రత్యర్థిగా ఉన్న ఆనం విజయకుమార్‌రెడ్డిని సిఎం పిలిచి మాటాడారు. ఆనం రామనారాయణరెడ్డి పార్టీ వీడినా నీవు పార్టీలోనే కొనసాగాలని సిఎం చెప్పినట్లు సమాచారం. ఈ వ్యవహారం జరుగుతున్న క్రమంలోనే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు తెలిసింది. ప్రభుత్వ పెద్దల ఆదేశంతో ఇంటిలిజెంట్ వర్గాలు గత కొద్ది రోజులుగా శ్రీధర్‌రెడ్డి ఫోన్‌ను ట్యాపింగ్‌లో పెట్టినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న శ్రీధర్‌రెడ్డి ఆయన సొంత ఫోన్ వాడకుండా మరి కొన్ని ఫోన్లు వాడుతున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని ఇటీవల శ్రీధర్‌రెడ్డి మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడుతూ అన్నారు. ఆదివారం ఉదయం నుంచి నెల్లూరు రూరల్ నియోజక ర్గానికి కొత్త ఇన్‌ఛార్జి నియామకం జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఇందులో ఆనం విజయకుమార్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి.కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డికి ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇవ్వడం ద్వారా కోటంరెడ్డి సోదరుల మధ్య విభేదాలు సృష్టించడానికి వైసిపిలో ఓ గ్రూపు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. కోటంరెడ్డి సోదరులను పక్కన బెట్టి ఆనం విజయకుమార్‌రెడ్డికి ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇస్తారనే అనుమానం కలుగుతుంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తీవ్ర మనస్థాపానికి గురైనట్లు సమాచారం. రాష్ట్రంలోనే పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు పనిచేస్తూ ఎన్నో మంచి కార్యక్రమాలు చేస్తున్న తనను కావాలనే పక్కన పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇలాంటి సమయంలో ఏమి చేయాలనే విషయంపై అభిమానులు, పార్టీ నేతలతో చర్చించినట్లు తెలిసింది. సిఎం ఢిల్లీ పర్యటనలో ఉన్న కారణంగా ఇన్‌ఛార్జి నియామకం ఎప్పుడు ఉంటుందా అని ఆసక్తి నెలకొంది. పరిస్థితులు ఇలాగే ఉంటే కోటంరెడ్డి పార్టీ మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.ఇటీవల వెంకటగిరి ఎంఎల్ఎ ఆనం రామనారాయణరెడ్డి ప్రశ్నించారనే కారణంగా నేదురుమల్లి రామ్ ుమార్‌రెడ్డికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఇంతటితో ఆగకుండా ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలకు ఆనం రామనారాయణరెడ్డిని దూరం చేశారు. ఆయన టిడిపిలో చేరుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. నెల్లూరు జిల్లాలో ఓ సామాజిక వర్గం పెద్ద ఎత్తున పార్టీ మారడానికి సన్నాహాలు జరుగుతున్నట్లు సమాచారం.

కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎంఎల్ఎ

## రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ జట్లు ఎంపిక

**ప్రజాశక్తి -కందుకూరు :** ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎపి సిఎం కప్ స్త్రీ పురుషుల బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక సోమవారం కందుకూరులో జరిగింది. ఈ ఎంపికకు జిల్లా వ్యాప్తంగా సుమారు 50 మంది బాల, బాలికలు హాజరయ్యారు. ఎంపికైన జట్టు త్వరలో జరిగే సీఎం కప్ రాష్ట్ర స్థాయి ఛాంపియన్ షిప్‌లో పాల్గొంటాయి. ఎంపికను జిల్లా స్పోర్ట్స్ ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ సహకారంతో జరిగింది. బాస్కెట్ బాల్ అసోసియేషన్ చైర్మన్ కంచర్ల రామయ్య పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొని ప్రకాశం జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. జిల్లా అసోసియేషన్ సెక్రటరీ టి సుబ్బారావు, ఈసీ నెంబర్ సయ్యద్ జిల్లాని, బాయ్స్ హై స్కూల్ పిడి శ్రీనివాసరావు, పోన్నలూరు పిడి చిరజీవి రెడ్డి పాల్గొన్నారు.

**పురుషుల జట్టుకు ఎంపికైన వారు వీరే :** కందుకూరుకు చెందిన సిహెచ్ హేమంత్ ,జి హరికష్ణ, ఎన్ సందీప్, టి మోహన్ చందు, కే వెంకటేష్ ,పి విష్ణువర్ధన్, జె జోసెఫ్, కే ఏసుబాబు, ఒంగోలు ఐఐటి కాలేజీ కు చెందిన ఆర్ గణేష్ ,డి హేమంత్ ,దర్శికి చెందిన పి పవన్ కుమార్ రెడ్డి ,పొన్నలూరు కు చెందిన జి మన్మధరావు ఎంపికయ్యారు.

**బాలికల జట్టుకు ఎంపికైన సభ్యులు వీరే..:**

కందుకూరు టిఆర్ఆర్ కళాశాలకు చెందిన పి సుష్మ గాయత్రి, ఈ కౌసల్య ,పి శాంతి ,డి హరిత ,కే స్రవంతి, ఎం కల్పన ,పొన్నలూరు కు చెందిన సిహెచ్ వైష్ణవి ,డి ఆమని, కేజీబీవీ కి చెందిన కే చిట్టెమ్మ, కే వైష్ణవి, మంజుష ఉన్నారు.

## జాతీయ పరిశుభ్రత దినోత్సవం

**నెల్లూరు :** వీధులు, రోడ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్ల వంటి పబ్లిక్ స్థలాల్లో పరిశుభ్రత మెరుగుపరచాల్సిన అవసరం ఉన్నదని నెహ్రూ యువకేంద్ర జిల్లా అధికారి ఆకుల మహేంద్ర రెడ్డి పేర్కొన్నారు. శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్టు మరియు పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నెల్లూరు మూలపేట లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 'జాతీయ పరిశుభ్రత దినోత్సవం' సందర్భంగా పరిసర ప్రాంతాలను శు భ్రం చేసి, విద్యార్థులకు అవగాహన కల్పించారు. శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్టు సెక్రటరి కె.మురళీమోహన్ రాజు మాట్లాడారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు పద్మావతి, గౌరవాధ్యక్షులు టి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## కమీషన్ల కోసం 'కాకాణి' కక్కుర్తి : సోమిరెడ్డి

**ప్రజాశక్తి-నెల్లూరు :** వేల కోట్ల ఆస్తులు కలిగిన వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కేవలం కమీషన్ కోసమే దేగపూడి-బండేపల్లి లింక్ కెనాల్ నిర్మాణ పనులు జరగకుండా అడ్డుకున్నారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమశిల జలాలు సంగం నుంచి 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న మనుబోలు మండలానికి రావడంలో ఎన్నో అవాంతరాలు ఏర్పడేవని, ఈ సమస్యను అధిగమించేందుకు సుమారు 25 వేల ఎకరాల ఆయకట్టు రైతుల కోసం దేగపూడి- బండేపల్లి లింక్ కెనాల్ నిర్మాణం తలపెట్టామన్నారు. మంత్రి కాకాణి కమీషన్ల కక్కుర్తి నేపథ్యంలో ఆ కాలువ నిర్మాణ పనులు నిలిచిపోయాయన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు రావూరు రాధాకష్ణమ నాయుడు, సైదాపురం మండల టీడీపీ అధ్యక్షుడు మోహన్ కష్ణారెడ్డి, సర్వేపల్లి నియోజకవర్గంలోని అన్ని మండలాల అధ్యక్షులు గాలి రామకష్ణారెడ్డి, తలచీరు మస్తాన్ బాబు, గుమ్మడి రాజాయాదవ్ ఉన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

## 'సోమిరెడ్డి' అవినీతిపరుడు

### మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

**ప్రజాశక్తి-నెల్లూరు :** అబద్ధాల చెప్పడమే పనిగా పెట్టుకున్న మాజీమంత్రి టిడిపి నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అవినీతి పరుడంటూ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బండేపల్లి- దేగపూడి కాల సంబంధించి మాజీ మంత్రి సోమిరెడ్డి ఆరోపణలపై కౌంటర్ ఇచ్చారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సోమిరెడ్డి నోరు తెరిస్తే అవినీతి అబద్ధాల కంపు కొడుతుందని, దేగపూడి-బండేపల్లి కాలువ పై సోమిరెడ్డి మాటలను చూసి ప్రజలు యావగిం చుకుంటున్నారన్నారు. 2018లో పనులు ప్రారంభమైతే అప్పుడు ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చలేకపోయారని మంత్రి కాకాణి ప్రశ్నించారు. బండేపల్లి దేగపూడి కాలువపై హాస్యాస్పందంగా ఉందన్నారు.

మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

## భూముల ఆక్రమణపై గిరిజనులు ఆవేదన

**ప్రజాశక్తి -కందుకూరు :** తమ భూమిని ఆక్రమించిన రైతు చల్లా మాల్యాద్రిపై చర్యలు తీసుకుని తమ భూమి తమకు దక్కేలా చర్యలు తీసుకోవాలని మండలంలోని చిన్న లాటరీపీ గ్రామ గిరిజనులు విజ్ఞప్తి చేశారు. సోమవారం వారు ఇక్కడ విలేకర్ల ముందు తమ వాపోయారు. సర్వే నెంబరు 769లో 5 ఎకరాల ప్రభుత్వ భూమిని తాత, తండ్రుల దగ్గర నుంచి సాగు చేసుకుని జీవిస్తున్నామని వారు తెలిపారు. అయితే ఆ సాగు భూమిని చల్లా మాల్యాద్రి అనే రైతు తమను బెదిరించి దౌర్జన్యంగా ఆక్రమిం చుకు న్నారని గిరిజనుడు కొమరగిరి మాలకొండయ్య నారాయణమ్మ పర్వతాలు వెంకాయమ్మ సుజాత సలోమి తెలిపారు. అతనిపై అట్రాసిటీ కేసు పెట్టి చర్యలు తీసుకోవడం తోపాటు తమ భూములు తమకు స్వాధీనం చేయాలని డిమాండ్ చేశారు.

**గిరిజనుల భూములు పరిరక్షించాలి : వ్య.కా.సం**

తాత తండ్రుల దగ్గర నుంచి గిరిజనులు సాగు చేస్తున్న భూము లను, చల్లా మాల్యాద్రి అక్రమంగా సాగు చేస్తూ, గిరిజనులను భూముల దగ్గరకు రానివ్వకుండా దౌర్జన్యం చేస్తున్నా చల్లా మాల్యాద్రి పై చట్ట ప్రకారం చర్య తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంటేన పల్లి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సర్వే నెంబర్ 769లో ఉన్న ప్రభుత్వ భూమిని ఆన్‌లైన్ చేసి గిరి జనులకు భూములు స్వాధీన పరిచి వారికి జీవనాధారం కల్పించాలని డిమాండ్ చేశారు.

## సోలార్ రంగంలో లాభాలు

**ప్రజాశక్తి -కందుకూరు :** సోలార్ రంగం లాభాలతో పాటు పెద్ద ఎత్తున ఉపాధికి మార్గాలను చూపిస్తుందని గ్రీన్ వియాన్ టెక్నాలజీస్ జి.ఎం. పురుషోత్తమ్ వెల్లడిం చారు. రెండు రోజులు పాటు ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థులకు వర్క్ షాప్ నిర్వహించిన ఆయనను విద్యార్థులు సత్కరించారని కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ కె విజయ శ్రీనివాస్ సోమవారం పేర్కొన్నారు. ప్రకాశం విద్యార్థులు సాంకేతికను అందుకోవడంలో అద్భుతంగా వ్యవహరించారని ఆయన ప్రశంసించారు. సోలార్ రంగంలో సోలార్ ప్యానల్స్ తయారీ, విద్యుత్ ఉత్పత్తి-విక్రయం, ఎలక్ట్రికల్ వెహికల్(ఇవి) ఛార్జింగ్ కేంద్రాలు తదితర వాణిజ్య అవ కాశాలు పుష్కలంగా ఉంటాయని వివరించారు. సోలార్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి గ్రామాల్లో ఐక్యంగా ఏర్పాటు చేసుకోవచ్చన్నారు.ప్రకాశం అకడమిక్ ఇన్‌ఛార్జి ఎస్.ఎం. మీరావలి ఆధ్వర్యంలో జరిగిన వర్క్ షాప్‌లో పూజిత, స్పందన, సతీష్ నిర్వాహకులుగా నిర్వహించారు.

## భారీ టిప్పర్లతో ప్రమాదాలు

**ప్రజాశక్తి -కందుకూరు:** రామాయపట్నం పోర్టు పనుల కోసం గ్రానైట్ ముడిరాళ్లను తరలిస్తున్న భారీ టిప్పర్ల వల్ల ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలగడంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం పొంచి ఉందని, అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ శాసనసభ్యులు దివి శివరాంతో కలిసి, సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో సబ్ కలెక్టర్ శోభికకు ఫిర్యాదు చేశారు. చీమకుర్తి నుంచి గ్రానైట్ ముడి రాళ్లను ప్రతిరోజు వందకి పైగా భారీ టిప్పర్లలో తీసుకెళ్తున్నారని తెలిపారు. టిప్పర్లలో పరిమితికి మించి రాళ్ళను తరలిస్తున్నారని, అధిక స్పీడ్‌తో వెళ్తుండటం వల్ల ముడిరాళ్లు రోడ్లపై జారీ పడుతున్నాయని సబ్ కలెక్టర్ దష్టికి తీసుకెళ్లారు. డిఎస్‌పి కండే శ్రీనివాసరావు, ఎంవిఐ మహ్మద్ రఫీను కలిసి నేతలు వినతి పత్రం అందజేశారు.

## విరాళం అందజేత

**ప్రజాశక్తి -కందుకూరు :** కందుకూరులోని అంకమ్మ తల్లి ఆలయ పునర్ నిర్మాణం ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా లయ నిర్మాణ కమిటీ సభ్యుల, భక్తుల పర్యవేక్షణలో జరుగుతోంది. ఆదివారం ఆలయ నిర్మాణానికి స్వర్గీయ కుంచాల వెంకటేశ్వర్ల జ్ఞాపకార్థం భార్య వెంకటరత్నం కుమారుడు శ్రీనివాసులు కోడలు విజయలక్ష్మి రూ.1,00,116 విరాళంగా ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు వెంకటరెడ్డికి అందజేశారు.

## గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

**నెల్లూరు :** జిల్లాలో గ్రంధాలయాల అభివద్ధికి అన్ని విధాల కషి చేస్తున్నామని జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్పర్సన్ దొంతు శారద పేర్కొన్నారు. సోమవారం స్టోన్ హౌస్పేట రేబాల వారి వీధి లోని జిల్లా గ్రంధాలయ సంస్థ భవనంలో సంస్థ చైర్పర్సన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వయోజన విద్య ఉపసంచాలకులు పి రమేష్, డిపిఆర్ఒ వెంకటేశ్వర ప్రసాద్ ఉన్నారు.

## కంపోస్ట్ ఎరువు తయారీ

**ప్రజాశక్తి-బిట్రగుంట** : చెత్త నుండి సంపద తయారు చేసే కేంద్రాలలో కంపోస్ట్ ఎరువులు తయారు చేయవచ్చని విశ్వనాథరావుపేట వైసిపి నాయకులు గండూరి శ్రీనివాసులు పేర్కొన్నారు. విశ్వనాథరావుపేట పంచాయతీ పరిధిలో ఉన్న చెత్త నుండి సంపద తయారు చేసే కేంద్రంలో ఉన్న పిచ్చి చెట్లను సోమవారం పంచాయతీ సర్పంచ్ గండూరి మంజుల ఆధ్వర్యంలో జెసిపి సహాయంతో పనులు చేపట్టారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు గండూరి శ్రీనివాసులు మాట్లాడారు.

## కుష్టు నివారణపై అవగాహన

**ప్రజాశక్తి-బిట్రగుంట** : విశ్వనాథరావుపేట పంచాయతీ కార్యాలయంలో సోమవారం స్పర్శ లెప్రసీపై అవగాహన కార్యక్రమాన్ని సర్పంచ్ గండూరి మంజుల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. సర్పంచ్ గండూరి మంజుల మాట్లాడారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెండ్లి వెంకటేశ్వర్లు, వార్డు మెంబర్ సుధీర్, చిలకా జయరాం, సచివాలయ వాలంటీర్లు కిషోర్, పెండ్లి శ్రీను, సచివాలయం 1,2 సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-సంగం** : మండల వైద్యాధికారి డాక్టర్ ప్రతిమ అశోక్ కుమార్ సంగం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో "స్పర్శ" లెప్రసి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెడ్ మాస్టారు మాల్యాద్రి, ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్తలు కవిత, ఎంఎల్‌హెచ్‌పి లక్ష్మీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెరుగైన సేవలందించేందుకు కృషి

**ప్రజాశక్తి-కావలి** : తపాలా శాఖ కల్పించిన వివిధ రకాల సేవలను అమలులో మెరుగైనసేవలుఅందించేందుకు తనవంతు కృషి చేస్తున్నానని నెల్లూరు డివిజన్ పోస్టల్ సూప పరెండెంట్ ఎస్ రామకృష్ణ పేర్కొన్నారు. సోమవారం కావలి హెడ్ పోస్టు ఆఫీస్ తనిఖీలో భాగంగా ఆయన ఇక్కడి పనితీరును పరిశీలించే నిమిత్తం విచ్చేసి, వివిధ విభాగాలను తనిఖీ చేసి, సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కార్యాలయ ఆవరణలో సిబ్బందికి అనువుగా విశ్రాంతి నిమిత్తం క్లబ్‌ను, బైక్ స్టాండును ప్రారంభించారు. ఇందులో ఎఎస్.పి.ముక్తేశ్వర రావు, హెడ్ పోస్టు మాస్టర్ ఎ వి కృష్ణయ్య, పిఆర్ఐ ఎం జి కె సాయి పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకులు పంపిణీ

**ప్రజాశక్తి-కావలి** : తాళ్లపాలెం రూరల్ హెల్త్ సెంటర్ (హెచ్ఐవి సెంటర్) హెచ్ఐవి రోగులకు సోమవారం నిత్యావసర సరుకులు, 250 మంది హెచ్ఐవి రోగులకు పంపిణీ చేశారు. అదే విధంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత డి.సుబ్బారావు వహించగా ముఖ్య అతిథులుగా ఎం.రాజేష్, రూరల్ సిఐ, ఎస్‌టి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శ్యాంసుందర్ మాట్లాడారు. దాతలు డాక్టర్ సతీష్, బియ్యం, సిద్దార్ బెడ్, కాలేజీ కమలమేడమ్ గోధుమ పిండి, ఎంఎస్ఆర్ డిగ్రీ కాలేజీవాళ్లు రాగిపిండి, మున్సిపల్ మాజీ చైర్మన్ గళ్ల శ్రీనివాస కిరణ్ బన్సీరవ్వ, కర్జూరం, జన ప్రకాషిణి రవీంద్ర, కోటేశ్వరరావు బియ్యం మొత్తం 250 మందికి దాతలు సహాయం అందించినారు. తాళ్లపాలెం పాస్టర్స్ జేసింత, జెనోవా, శ్రీనివాసరావు, కృష్ణమూర్తి అమృత రాజగోపాల్ పాల్గొన్నారు.

## డాక్టర్ షకీల జన్మదిన వేడుకలు

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్** : ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని బిఎస్ఆర్ హాస్పిటల్ అధినేత్రి డాక్టర్ షకీలా జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం పట్టణంలోని జమ్మలపాలెం గిరిజన కాలనీలో డాక్టర్ షకీలా జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి చిన్నారులకు స్వయంగా ఆమె పంచిపెట్టారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలకు విశేష వైద్య సేవలు అందిస్తూ అనేక సామాజిక సేవా కార్యక్రమాలకు చేయూతనిస్తూ స్వచ్ఛభారత్ స్వచ్ఛ ఎపి అమలకు చేయూతనిచ్చారు. విశ్రాంతి ఉపాధ్యాయులు సాదిక్ హుస్సేన్, ఉపాధ్యాయులు హరికృష్ణ, ఖాజా రసూల్, సంస్థ నిర్వాహకులు వాగాల శ్రీహరి, ఐద్వా నాయకురాలు గుల్జార్ బేగం, ప్రజా గాయకుడు గద్దర్ బాబు తదితరులున్నారు.

## పొగాకు బ్యారెన్ దగ్ధం

**ప్రజాశక్తి-మర్రిపాడు** : మండలంలోని కేతిగుంట గ్రామంలో గాలిబోయిన చిన్నపెంచలయ్య కౌలుకు తీసుకున్న పొగాకు బ్యారెన్ సోమవారం దగ్ధమైంది. బ్యారెన్ 1100 అల్లిన కర్రను క్యూరింగ్ కోసం ఉంచారు. క్యూరింగ్ సమయంలో ప్రమాదవశాత్తు ఆకు రాలి గొట్టాలపై పడడంతో మంటలు వ్యాపించి బ్యారన్ మొత్తం అగ్నికి ఆహుతైంది. ఈ ఘటనలో సుమారు రూ.3.50లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయారు. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో వచ్చి మంటలను అదుపు చేశారు. బోర్డు అధికారులు ఆదుకోవాలని రైతు కోరారు.

## విద్యార్థినిపై దాడి

- ఎంఇఒ విచారణ

**ప్రజాశక్తి-ఉదయగిరి** : మండలంలోని గండిపాలెం గుంటుపల్లి కొండయ్య చౌదరి సుబ్బమ్మ బాలికల ఉన్నత పాఠశాలలో 8వ తరగతి ఇంగ్లీష్ మీడియం చదువుతున్న లాకా మనీషా అనే విద్యార్థిపై చంద్ర శ్రీనివాసులు అనే ఉపాధ్యాయుడు దాడి చేసి గాయపరిచిన సంఘటనకు సంబంధించి సోమవారం మండలం విద్యాధికారి షేక్ మస్తాన్‌వలీ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా విచారణలో విద్యార్థిని తల్లిదండ్రులు తెలిపిన సమాచారం మేరకు మనీషా తన పక్కన ఉన్న తోటి విద్యార్థిని దగ్గర పెన్సిల్ అడిగినందున కారణంతో ఉపాధ్యాయుడు చంద్ర శ్రీనివాసులు విచక్షణారహితంగా పాప పై దాడి చేశారని పాప వీపు మీద గుండెల మీద చెంప మీద కొట్టి ఎడమ చేతిని గోర్లతో రక్కగా రక్త గాయాలు కూడా అయ్యాయని సాధారణంగానే అనారోగ్య కారణాలు ఉన్న విద్యార్థిని ఉపాధ్యాయుడు దారుణమైన రీతిలో కొట్టడంతో చాలా భయాందోళన కలుగుతుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. పాప జ్వరానికి లోను కాగా వేరే వాళ్లు తమకు ఫోన్ ద్వారా సమాచారం అందించగా పశువుల కాపరిగా వెళ్లి ఉన్న తాను హుటాహుటిన పాఠశాలకు చేరుకొని పాప బెంచ్‌పై పడుకొని ఉండగా విద్యార్థిని తండ్రి తెలిపారు. విచక్షణ రహితంగా కొట్టి దాడి చేసి గాయపరిచిన ఉపాధ్యాయుడిపై ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని మనీషా తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. జరిగిన ఘటనపై నివేదికను సంబంధిత అధికారులకు పంపుతామని ఎంఇఒ తెలిపారు. అనంతరం జిల్లా ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థి పాఠ్యాంశాలను పరిశీలించి నాణ్యమైన విద్య అందించి వందకు 100శాతం మార్కులు సాధించేలా ఉండాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## దర్గాను సందర్శించిన సిఐ రవినాయక్

**ప్రజాశక్తి-ఎఎస్‌పేట** : స్థానిక ప్రముఖ పుణ్యక్షేత్రమైన హజరత్ సయ్యద్ రహమతుల్లా నాయబ్ రసూల్ స్వాముల వారి దర్గాను సంగం సిఐ ఎం.రవినాయక్ సోమవారం సందర్శించారు. ఎస్ఐ పి.నరేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు వాగులో పడి వ్యక్తి మృతి

**ప్రజాశక్తి-ఎఎస్‌పేట** : మండలంలోని జమ్మవరం గ్రామానికి చెందిన ఐత పెంచలయ్య (50) ప్రమాదవశాత్తు వాగులో పడి మృతి చెందినట్లు సంగం సిఐ ఎం.రవినాయక్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జమ్మవరం గ్రామానికి చెందిన వెంకటరమణమ్మ తన భర్త పెంచలయ్య వాగులో పడి మృతి చెందినట్లు సోమవారం ఎఎస్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఆ మేరకు స్థానిక ఎస్ఐ పి.నరేష్ సిబ్బందితో వెళ్లి ఘటన స్థలాన్ని పరిశీలించి క్రైమ్ నెంబర్ 174 కింద కేసు నమోదు చేశారు. 29వ తేదీ వెళ్లిన పెంచలయ్య ఓ కొంగను వేటాడగా అది దొరకకపోవడంతో 30 వ తేదీ వేట కెళ్లి వాగులో కొంగ కోసం ఈదుకుంటూ వెళ్లగా ప్రమాదవశాత్తు వాగులో చిక్కుకొని మృతి చెందినట్లు భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు సోమవారం పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గ్రామస్థుల సహకారంతో వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు సంగం సిఐ ఎం.రవినాయక్ తెలిపారు.

## డిజిటల్ లైబ్రరీ ప్రారంభం

**ప్రజాశక్తి - కావలి** : స్థానిక విక్రమ సింహపురి యూనివర్సిటీ పి.జి.కళాశాలలో గ్రంథాలయాన్ని, డిజిటల్ లైబ్రరీని సోమవారం ప్రారంభించారు. ఈ రెన్యువల్ లైబ్రరీని యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ జి.ఎం.సుందరవల్లి ప్రారంభించారు. కార్యక్రమానికి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.రామచంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉపకులపతి ఈ సందర్భంగా మాట్లాడుతూ డిజిటల్ దశలో పుస్తక పఠనం ప్రాముఖ్యతను తెలిపారు. అభివృద్ధికి విద్య ప్రాతిపదిక అయితే విద్యకు ప్రాతిపదిక పుస్తకం అని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చిలుమూరు శ్రీనివాసరావు, గ్రంథాలయ సహాయకులు ఒ.పి.పాపయ్య, అధ్యాపక, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## వాహనదారులు హెల్మెట్ ధరించాలి

**ప్రజాశక్తి-కోవూరు:** రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా ఎస్పీ విజయ రావు ఆదేశాల మేరకు కోవూరు సిఐ రామకృష్ణ రెడ్డి, ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బందితో కలిసి హెల్మెట్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. పై కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దొడ్డం రెడ్డి నిరంజన్ బాబు రెడ్డి హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.

# సిఎం చొరవతో అగ్రికల్చర్ యూనివర్సిటీ ఏర్పాటు

**ప్రజాశక్తి-ఉదయగిరి**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డితో ఉదయగిరికి అగ్రికల్చర్ కళాశాల ఏర్పాటు చేసినట్లు మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రభుత్వ అగ్రికల్చర్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న మాజీమంత్రి గౌతమ్ రెడ్డి మెమోరియల్ స్మృతివనానికి సంబంధించిన ఆర్కిటెక్ ఇంజనీర్లతో కళాశాల ప్రాంగణం పరిశీలించి ఎంజిఆర్ ఘాట్ వద్ద ఏర్పాటుకు ఆర్కిటెక్ ఇంజనీర్లతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చొరవతో యూనివర్సిటీగా కూడా రూపాంతరం చెందడానికి ఎంతోకాలం పట్టదని, ఈ ప్రాంతంలో ఉన్న చిన్న, సన్న కారు రైతులకు యూనివర్సిటీ వల్ల ఎంతో ప్రయోజనం చేకూరానుందన్నారు. అదే విధంగా గోదావరి నీళ్ల కూడా శ్రీశైలం మీదుగా ఉదయగిరికి చేరే అవకాశం ఉందని, రాబోయే రోజుల్లో వెలిగొండ కెనాల్ పూర్తిగా వస్తుందని ముఖ్యమంత్రి ఎంతో చొరవతో పనులు పూర్తి చేస్తున్నారన్నారు. ప్రస్తుతం ఉదయగిరికి దగ్గరలో మూడు జాతీయ రహదారులు ఉన్నాయని, కొంత దూరంలో మరో జాతీయ రహదారి కూడా ఉందని నూతనంగా మంజూరైన కావలి నుంచి సీతారాంపురం జాతీయ రహదారి, ఉదయగిరిని కలుపుకుంటూ వెళితే ఉదయగిరికి మహర్దశ పట్టడం రహదారుల పరంగా కూడలి ప్రాంతంగా ఏర్పాటు కావడం జరుగుతుందన్నారు. అదేవిధంగా నడికుడి శ్రీకాళహస్తి రైల్వే పనులు కూడా చురుకుగా సాగుతున్నాయని ప్రకాశం జిల్లా కనిగిరి వింజమూరును కలుపుకుంటూ ఆత్మకూరు మీదుగా నిర్మాణం జరుగుతుందని ఈ ప్రాంతానికి సులభమైన మార్గాలు ఏర్పడనున్నాయని తెలిపారు. గౌతమ్ రెడ్డి మెమోరియల్ స్మృతివనం నిర్మాణం కోసం ప్రముఖ ఆర్కిటెక్ ముంబై నుంచి రాహుల్ మల్హోత్రా, అమెరికా నుంచి రాబర్ట్ వచ్చారని తెలిపారు. స్మృతివనం నిర్మాణ పనులు నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ డిజైన్ చేస్తున్న ఢిల్లీబాబు ఆధ్వర్యంలో జరగనున్నట్లు తెలిపారు. రూ.2.50 కోట్ల అంచనాతో నిర్మించనున్న గౌతమ్‌రెడ్డి మెమోరియల్ స్మృతివనం ఏర్పాట్లపై ముందుగా ఇక్కడ పరిస్థితులను ఆర్కిటెక్ బృందానికి చూపించినట్లు తెలిపారు. అతి త్వరలో స్మృతివనం ఏర్పాటు చేస్తున్నట్లు, ఈ ప్రాంతానికి తలమానికంగా ఉండే విధంగా ఇంజనీర్లు రూపకల్పన చేయనున్నారన్నారు. మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రభుత్వ అగ్రికల్చర్ కళాశాల ప్రిన్సిపాల్‌తో వారి బృందంతో మాట్లాడినప్పుడు తనకు చాలా సంతోషంగా అనిపించిందని ఈ ప్రాంతంలో ఇలాంటి కాలేజీ మంజూరు కావటం ఎంతో అదృష్టంతో కూడుకున్న పని అని అయితే యూనివర్సిటీగా రూపాంతరం చెందటానికి కూడా ఎంతో సమయం పట్టదని వారు తెలిపారు. స్మృతి వనం నిర్మాణం పూర్తయితే వచ్చే మాసంలో ముఖ్యమంత్రి ద్వారా ప్రారంభించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్కిటెక్ ఇంజనీర్ల బృందం రాబర్ట్ మల్హోత్ర, తులసి, అగ్రికల్చర్ కళాశాల ప్రిన్సిపాల్ కరుణాసాగర్ రెడ్డి, జెడ్పి కోఆప్షన్ మెంబర్ గాజుల తాజుద్దీన్, వింజ మూరు, దుత్తలూరు జెడ్‌పిటిసిలు గణపం బాల కృష్ణారెడ్డి, లెక్కల లక్ష్మీకాంతమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎంపి మేకపాటి

# మద్యాన్ని నిషేధించాలి : ఐద్వా

**ప్రజాశక్తి-మర్రిపాడు**

మండలంలో బెల్ట్‌షాపులు ఎక్కువయ్యాయని, రోజువారీ కూలీలు సంపాదన మొత్తం మద్యంపై వెచ్చించి తాగుతున్నారని, మద్యపానం నిషేధానికి ప్రభుత్వం కృషి చేయాలని ఐద్వా నాయకులు పేర్కొన్నారు. సోమవారం ఈ మేరకు స్థానిక సిపిఎం కార్యాలయంలో ఐద్వా మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐద్వా మండల కార్యదర్శి శ్యామలమ్మ పాల్గొని మాట్లాడుతూ మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆమె మాట్లాడారు. అలాగే ఐద్వా మహిళా సభ్యత్వాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఐద్వా మండలాధ్యక్షురాలు మూలి ప్రమీల మాట్లాడుతూ మండలంలో మద్యం బెల్టు షాపులు ఎక్కువయ్యాయని, దీనితో యజమానులు కూలి పనులు చేసి సంపాధించిన డబ్బులు మద్యానికే ఖర్చు పెడుతున్నారని గ్రామాలలో ఉండే బెల్టు షాపులను అరికట్టాలన్నారు. అలాగే మానవీ బుక్స్, మార్చిలో జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవంపై చర్చించారు. సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య, మండల కార్యదర్శి రహంతుల్లా, నందవరం సీనియర్ నాయకులు మహమ్మద్ గౌస్, ఐద్వా గ్రామ నాయకురాలు ఖాసింబీ, రమణమ్మ, మున్నీ, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐద్వా నాయకులు

## రాష్ట్రస్థాయికి భావన ఎంపిక

**ప్రజాశక్తి-బిట్రగుంట**

విశ్వనాథరావుపేట పంచాయతీ జిల్లా ప్రజా పరిషత్ బాలికల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వై.భావన వైజ్ఞానిక ప్రదర్శనలో అగ్రికల్చర్ రైతులకు అవసరమైన పరికరాన్ని తయారు చేసినందుకు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ భావన తెలివితేటలకు రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రశంసా పత్రాన్ని జ్ఞాపికను అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విజయలక్ష్మి, విద్యార్థి తండ్రి ఎన్నుబట్టిన వెంకటేశ్వర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## రూ.5 లక్షలు కేటాయించాలి

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**

జగనన్న కాలనీలకు రూ.5 లక్షలు కేటాయించాలని సిపిఐ ఆత్మకూరు నియోజకవర్గం సమితి ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దారు లక్ష్మి నరసింహాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి యమాల మధు మాట్లాడుతూ జగనన్న కాలనీలకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన లక్ష 80 వేలతో ఇల్లు నిర్మించడం అసాధ్యమని తెలిపారు. ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.1,80,000తో ఒక ఇల్లు ఏ విధంగా నిర్మించుకోగలరని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు శేషాద్రి, కృష్ణ, పుల్లయ్య, రామచంద్రయ్య, నాయకులు పాల్గొన్నారు.

## నూతన హంగులతో బస్టాండ్ ప్రారంభం

**ప్రజాశక్తి-అనంతసాగరం** : మండల కేంద్రంలో కొత్త బస్టాండ్ నిర్మాణ పనులు చేపట్టి పూర్తికావస్తుండడంతో నూతన కల సంతరించుకుందని జెడ్‌పిటిసి వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. బస్టాండ్ నిర్మాణం మండల ప్రజలకు కలగా మిగిలి పోగా, ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి, జెడ్‌పిటిసి కృషితో దశాబ్దాల నాటికల నెరవేరిందన్నారు. ప్రయాణికులకు ఆధునాతన సౌకర్యాల కల్పనతో బస్టాండ్ ప్రారంభానికి సిద్ధమవుతుందని తెలియజేశారు. ఈ మేరకు బస్టాండ్ నిర్మాణ పనులను నాయకులతో కలిసి జెడ్‌పిటిసి రాపూర్ వెంకటసుబ్బారెడ్డి క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులను పరిశీలించారు. బస్టాండ్ ప్రారంభమైతే ప్రయాణికులకు ఇబ్బందులు తొలగినట్లేనని ప్రయాణికులు అనుకుంటున్నారు.

## వాడివేడిగా పంచాయతీ సమావేశం

**ప్రజాశక్తి-జలదంకి** : జలదంకి పంచాయతీ సమా వేశం సోమవారం వాడీవేడీగా జరిగింది. సర్పంచ్ అనురాధ అధ్యక్షతన సమావేశం జరగ్గా వార్డు సభ్యులు ఉప సర్పంచ్ పలు ప్రశ్నలు సంధించారు. పంచాయతీ ఉపసర్పంచ్ కూరపాటి మాలకొండారెడ్డి ప్రశ్నలు సంధిస్తూ ఉంటే అధికారులు 'సర్పంచ్ నీళ్లు నమిలారు. పంచాయతీ సర్పంచ్ లే అవుట్లకు ఇష్టారాజ్యంగా విద్యుత్ సరఫరాకు సంతకం చేశారని కూరపాటి మాలకొండారెడ్డి సర్పంచ్ తీరును ఆధారాలతో సహా ఆరోపించారు. కార్యక్రమంలో పంచాయతీసెక్రటరీ జి వెంకటేశ్వర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్ సుధాకర్ రెడ్డి లను తమ విధులకు న్యాయం చేయాలని లేనిపక్షంలో కఠినంగా శిక్షింపబడతారని వార్డు సభ్యులు హెచ్చరించారు. సచివాలయం సిబ్బంది, వార్డు సభ్యులు, రామాల రమేష్ రెడ్డి, దేవరపల్లి వెంకట రమణమ్మ, గోసు ప్రసాద్, ఆతిన శ్రీనివాసులు, ఎలికా దానియేలు, సాధు వెంకమ్మ, జంపాని శ్రీనివాసులు, పోట్లూరి జయమ్మ, ఏకశిరి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## నష్టపరిహారం చెల్లించాలి

**ప్రజాశక్తి-అనంతసాగరం**

మండలంలో 2013 భూ సేకరణ చట్టం ప్రకారంగా నష్టపరిహారం చెల్లించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం తహశీల్దారు కార్యాలయంలో జాతీయ రహదారి 67 నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో అవార్డు ఎంక్వయిరీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలం లోని బొమ్మవరం, తొలిజాపురం, ఆమన సిరివెళ్ల, వెంగంపల్లి, ఇనగలూరు, లింగంగుంట, దేవరాయ పల్లి బిట్ వన్ గ్రామాలలోని భూముల్లో జాతీయ రహదారి 67 నిర్మాణం కోసం భూములు సేకరించాలని సర్వే చేశారు. ఆ సర్వే సక్రమంగా జరగ లేదని సర్వే అధికారులు నోటీసులో ఇచ్చిన విస్తీర్ణం వేరు వాస్తవంగా భూమి విస్తీర్ణం వేరుగా ఉందన్నారు. కావున మళ్లీ రీ సర్వే చేయించి రైతులు ఎంత విస్తీర్ణం కోల్పోతున్నారో చెప్పాలన్నారు. అలాగే 2013 భూ సేకరణ చట్ట ప్రకారంగా రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. 2013 భూ సేకరణ చట్టంలో బహిరంగ మార్కెట్లో ఉన్న భూమి విలువకు విలువకు మూడంతలు కలిపి ఇవ్వాలని అలాగే పట్టా భూములతో పాటు అసైన్డ్ భూములకు కూడా సమానంగా నష్టపరిహారం చెల్లించాలని కోరారు. జాతీయ రహదారికి తమ జీవనాధారమైన భూములు తీసుకోవద్దని రైతులు వాపోయారు. మంగళవారం మిగిలిన గ్రామాలు రైతులతో సమావేశం ఉంటుందని తహశీల్దారు తెలిపారు. తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దారు ప్రదీప్‌కుమార్, విఆర్ఒ సాయి, గ్రామ రైతులు మాదిరెడ్డి పుల్లారెడ్డి, ఈగ పుల్లారెడ్డి, మంగళ చెన్నయ్య, గండికోట పెంచలయ్య, గువ్వల పెంచల్ రెడ్డి, కుంటా పెంచలరావు, మంగళ పెంచల్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న వ్యకాసం నాయకులు

## 432 ఎకరాల భూమిని కాపాడాలి

**ప్రజాశక్తి-సీతారామపురం**

సీతారామపురం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 1 లో ఉన్న 432 ఎకరాల మేత పోరంబోకు భూమిని అక్రమార్కుల నుండి కాపాడాలని సీతారామపురం సర్పంచ్ కొడవటికంటి భాగ్యమ్మ ఆధ్వర్యంలో రైతులు, గ్రామస్తులు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ విషయమై సోమవారం తహశీల్దార్ షాజియా బేగంకు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సర్వే నెంబర్ 1లో ఉన్న భూమి చాలాకాలంగా మేత పోరంబోకు భూమిగా ఉంటూ పశువుల మేతకు ఉపయోగిస్తున్నామని, రికార్డులలో సైతం మేత పోరంబోకు భూమిగా ఉందన్నారు. కొందరు గత నెల 24వ తేదీన సర్వేలో నెంబర్ 1లో 47 ఎకరాలు వారిపై ఉందని అందులో నుండి 10 ఎకరాలు మరొకరికి అమ్మారని కోర్టు ఉత్తర్వులను చూపిస్తూ గ్రామ సర్వేయర్, సిబ్బందితో భూమి వద్దకు వచ్చి హద్దులు వేయించుకోవడంతో ఆ విషయం గ్రామస్తులకు తెలిసి కోర్టు నియమించిన ఏక సభ్య కమిషన్ వద్దకు వెళ్లి ఈ భూమి మేత పోరంబోకు భూమి అను ఈ భూమికి సంబంధించి ఎవరికీ ఎటువంటి పట్టాలు ఇవ్వరాదని కోరామన్నారు. అదేవిధంగా సర్వే నెంబరు 1లో ఉన్న భూమి రికార్డులను పరిశీలించి ఎటువంటి ఆక్రమనలకు గురికాకుండా మేత పోరంబోకు భూమిగానే ఉంచాలని తహశీల్దార్‌ను కోరామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద గౌస్, కృష్ణ బాబు, సురేషు, తమ్మిశెట్టి రమణయ్య, బోగినేని కాశయ్య, మాబు, బాల సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దారుకు సమస్యను వివరిస్తున్న గ్రామస్తులు

## డాక్టర్ ఆదిశేషయ్యకు సన్మానం

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్** : మాజీ జెడ్‌పిటిసి సభ్యులు వైసిపి నాయకులు ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య తన అమెరికా పర్యటన దిగ్విజయంగా పూర్తి చేసుకుని తన స్వగ్రామమైన ఆత్మకూరు విచ్చేసిన సందర్భంగా సోమవారం ఆయన్ను వైసిపి నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గోపారం వెంకట రమణమ్మ, పట్టణ అధ్యక్షులు అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, మాజీ ఎఎంసి చైర్మన్ ఇందూరు వెంకట రమణారెడ్డి, ఎస్‌సిసెల్ జిల్లా అధ్యక్షులు కొండా వెంకటేశ్వర్లు, 5వ వార్డు కౌన్సిలర్ మహబూబ్ బాషా, 2వ వార్డు కౌన్సిలర్ శివకోటారెడ్డి, నాయకులు నారాయణరెడ్డి, తోడేటి మణి, జైపాల్ రెడ్డి, కొప్పోలు వెంకటేశ్వర్లు, రహీమ్, జమ్రు పాల్గొన్నారు.

## ఇంటింటికి టిడిపి

**ప్రజాశక్తి-కావలి** : కావలి పట్టణ 39వ వార్డులో 12వ రోజు టిడిపి కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మాలేపాటి సుబ్బనాయుడు ఆధ్వర్యంలో 'ఇదేమి ఖర్మ రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా సోమవారం 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ నాయకులు ఇంటి వద్దకు వెళ్లగానే ప్రజలే వారి సమస్యలపై గళమువిప్పారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి తమను పట్టించుకున్న వారే లేదని, తమ వార్డులో దోమల సమస్య విపరీతంగా ఉండి విషజ్వరాల బారిన పడుతున్నామని మొరపెట్టుకున్నారు. పార్టీ ఉపాధ్యక్షులు మన్నవ రవిచంద్ర, రాష్ట్ర లీగల్ సెల్ ఉపాధ్యక్షులు పొట్లూరి శ్రీనివాసులు, మున్సిపల్ మాజీ చైర్మన్ పోతుగంటి అలేఖ్య, పట్టణ ఉపాధ్యక్షులు, 5వ క్లస్టర్ ఇన్‌చార్జ్ గుత్తికొండ కిషోర్ బాబు, పట్టణ పార్టీ మహిళా విభాగం అధ్యక్షు రాలు ద్రోణాదుల వాసంతి, వెంకట్రావు వార్డు టిడిపి అధ్యక్షులు తోట కళ్యాణ్, బూసి రాజేష్, కె మనోజ్, ఖాదర్ అలీ, మహిళా నేతలు శ్రీలక్ష్మి, కుల్లురు అశ్విని, షేక్ మున్ని, జయంపు లీలావతి, లక్ష్మి, జూలీ అరుణ, షేక్ బిబిజాన్, బూసి శేషమ్మ, నాగూర్, శివ తదితరులున్నారు.

## బస్‌షెల్టర్‌ను ఢీకొన్న బైక్

**ప్రజాశక్తి-సీతారామపురం** : బైకు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బస్ షెల్టర్‌ను ఢీకొనడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలైన ఘటన సోమవారం మండలంలోని సంజీవరెడ్డి నగర్ సమీపాన చోటుచేసుకుంది. వారిని మెరుగైన వైద్యం కోసం ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# గాంధీజీకి ఘన నివాళులు

**ప్రజాశక్తి-మర్రిపాడు** : గాంధీజీ 75వ వర్ధంతి సందర్భంగా తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ హేమంత్ కుమార్, డిప్యూటీ తహశీల్దార్ ఆనందరావు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురేంద్ర, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి భారత దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను త్యాగం చేశారన్నారు.

**ప్రజాశక్తి-సంగం** : స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలలో డాక్టర్ ప్రతిమ గాంధీ వర్ధంతి సందర్భంగా జాతీయ కుష్టి వ్యాధి నివారణా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి వారు ప్రతిజ్ఞ చేశారు. కుష్టి వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

**ప్రజాశక్తి-కోవూరు**: టిడిపి నెల్లూరు పార్లమెంట్ ప్రధానకార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి, కోవూరు గాంధీ పార్క్ వద్ద గల గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు కలికి సత్యనారాయణ రెడ్డి, ఇంటూరు విజయ్, ఇందూపురు మురళి కష్ణ రెడ్డి, కె గోపాల్, అంకెం వెంకటేశ్వర్లు, మీరయ్య పి వెంకటేష్ ,లక్ష్మయ్య పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-ఉదయగిరి** : సోమవారం స్థానిక పట్టణంలో గాంధీ వర్ధంతిని ఎంపి డిఒ ఐజాక్‌ప్రవీణ్, గండిపాలెం ప్రాథ మిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి శివకల్పన గాంధీజీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిహెచ్ ఒ శివ కుమారి, మండల కుష్టు, టీబీ నోడల్ పర్సన్ షేక్ అక్బర్‌బాషా, ఆడ ఆరోగ్య పరీవెక్షకులు మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు ఆరోగ్య కార్యకర్తలు మన్సూర్, రబ్బానీ, ఎఎన్ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-ఇందుకూరుపేట** : మండలంలోని కొత్తూరు జివికె చిన్మయ విద్యాలయంలో గాంధీజీ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి నివాళులర్పించి, రెండు నిముషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విద్యాలయ బ్రహ్మాచారి హర్షసాయి విద్యాలయ కరస్పాండెంట్ బద్దెపూడి హరిత విచ్చేశారు. హెచ్‌ఎం అజిత్ ఠాగూర్, ఉపాధ్యాయులు సీతాలక్ష్మీ, పద్మలత, భాస్కర్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్** : గాంధీజీ వర్ధంతి పురస్కరించుకొని ఆత్మకూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి ఎంపిడిఒ శ్రీనివాసులు పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమంలో కార్యాలయపు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-ఎఎస్‌పేట** : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జాతిపిత గాంధీ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సయ్యద్ అబ్దుల్ హమీద్ ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు ప్రధానోపాధ్యాయులు ఎస్ సుధాకర్ రావు, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-కొండాపురం** : గాంధీజీ వర్ధంతి సందర్భంగా సాయిపేట పంచాయతీ కార్యాలయంలో సోమవారం వర్ధంతి సభ నిర్వహించి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవులు విఆర్ఒ అన్నలూరి వెంకటప్రసాద్‌రావు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-వరికుంటపాడు** : మండలం ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ విజయ భాస్కరరావు అధ్యక్షతన గాంధీజీ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ రామకృష్ణారెడ్డి, సిబ్బంది ప్రసాద్, థామస్, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-కావలి** : గాంధీజీ వర్ధంతి సందర్భంగా సోమవారం కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు ఆదేశానుసారం టిడిపి శ్రేణులు కావలి పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పించే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ కార్యదర్శి మొగిలి కల్లయ్య, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు మన్నవ రవిచంద్ర, రాష్ట్ర పార్టీ లీగల్ సెల్ ఉపాధ్యక్షులు పోట్లూరి శ్రీనివాసులు, పట్టణ ఉపాధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, జిల్లా రైతు విభాగం ఉపాధ్యక్షులు బొట్లగుంట శ్రీహరి నాయుడు, పార్లమెంట్ ఎస్‌సి సెల్ అధ్యక్షులు కాకి ప్రసాద్, రాష్ట్ర మైనారిటీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ మస్తాన్, సెక్రటరీ షేక్ ఖాదర్ బాషా, రాష్ట్ర టిఎన్ఎస్ఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ దార్ల శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-కావలి** : సోమవారం గాంధీజీ వర్ధంతి సందర్భంగా రెడ్‌క్రాస్ భవనంలోని గాంధీ విగ్రహానికి కావలి రెడ్ క్రాస్ చైర్మన్ డి రవిప్రకాష్, సిబ్బంది ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు ఓరుగంటి వెంకటేశ్వర్లు, మధురాంతకం నళిని, మొగిలిశెట్టి జమున, రెడ్‌క్రాస్ మేనేజర్ బిఎస్ ప్రసాద్, రక్తకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

**In the Court of the IV Addl. District Judge : Nellore**
**O.S.No. 72 / 2021**

**Sannareddy Subba Reddy** - Plaintiff
Vs
**Sanampudi Vijayamma** - Defendant

**Notice**

To,
**Sanampudi Vijayamma,**
W/o **Pulla Reddy,**
D/o **Karuru Seshareddy,** Working maid,
R/o Atramvari Kandriga, Venkatachalam Mandal, SPSR Nellore District.

పై నెంబరున వాది డిక్లరేషన్ మరియు పర్మినెంట్ ఇంజంక్షన్ ఉత్తర్వులు కోరుతూ పై తెలిపిన కోర్టు లో మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తే20-02-2023ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

**పిడూరు నాగేశ్వర రావు,** బి.ఎస్‌సి., బి.ఎల్., వాది తరఫు అడ్వకేట్, నెల్లూరు.

**In the Court of the IV Addl. District Judge : Nellore**
**I.A.No. 19 / 2022**
**O.S.No. 72 / 2021**

**Sannareddy Subba Reddy** - Petitioner / Plaintiff
Vs
1. **Sanampudi Vijayamma** (1st defendant)
2. **Papareddy Vijayasenareddy**
3. **Sannareddy Srinivasula Reddy**
(Proposed parties) - Respondents

**Notice**

To,
R1. **Sanampudi Vijayamma,**
W/o **Pulla Reddy,**
D/o **Karuru Seshareddy,** Working maid,
R/o Atramvari Kandriga, Venkatachalam Mandal, SPSR Nellore District.

పై నెంబరున పిటిషనరు/వాది పై దావాలో మరియు ఇంజంక్షన్ పిటిషన్ ఐ.ఎ.నెం.295/2021లో 2, 3 వారలను ప్రపోజ్డ్ పార్టీలుగా (2, 3 ప్రతివాదులుగా) చేర్చమని కోరుతూ పై తెలిపిన కోర్టులో పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే20-02-2023ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

**పిడూరు నాగేశ్వర రావు,** బి.ఎస్‌సి., బి.ఎల్., పిటిషనర్ / వాది తరఫు అడ్వకేట్, నెల్లూరు.

**In the Court of the IV Addl. District Judge : Nellore**
**I.A.No. 295 / 2021**
**O.S.No. 72 / 2021**

**Sannareddy Subba Reddy** - Petitioner / Plaintiff
Vs
**Sanampudi Vijayamma** - Respondent / Defendant

**Notice**

To,
**Sanampudi Vijayamma,**
W/o **Pulla Reddy,**
D/o **Karuru Seshareddy,** Working maid,
R/o Atramvari Kandriga, Venkatachalam Mandal, SPSR Nellore District.

పై నెంబరున పిటిషనరు / వాది టెంపరరీ ఇంజంక్షన్ ఉత్తర్వులు కోరుతూ పై తెలిపిన కోర్టులో మీపై పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే20-02-2023ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

**పిడూరు నాగేశ్వర రావు,** బి.ఎస్‌సి., బి.ఎల్., పిటిషనర్ / వాది తరఫు అడ్వకేట్, నెల్లూరు.

**డాక్యుమెంట్లు పోయినవి**

నా క్లయింట్ అయిన **సిద్దవరపు సుమంత్ కుమార్ రెడ్డి,** తండ్రి లేట్ ఎస్.వి.భాస్కర్ రెడ్డి, డోర్ నెం.24-1622, దర్గామిట్ట, నెల్లూరు సిటీ. ఒరిజినల్ డాక్యుమెంట్లు వ్యవసాయభూమికి సంబంధించి పెరుమాళ్ళపాడు గ్రామం, సైదాపురం మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సంబంధించిన ఒరిజినల్ **డాక్యుమెంట్లు నెం.887/1992** మరియు **4632/1988** ఈ ఒరిజినల్ రిజిష్టర్డు డాక్యుమెంట్లుకు సంబంధించి **లింకు డాక్యుమెంటు నెం.97/1964** నా క్లయింటు బంధువుల ఇంటికి **తే23.01.2023** దిన ఎ.ఎస్.పేట గ్రామం నుండి జెరాక్స్ తీసుకొని ఇంటికి పోవుచుండగా మార్గమధ్య లో జారిపడిపోయినవి. ఈ ఒరిజినల్ లింకు డాక్యుమెంటు ఎవ్వరికైన దొరికిన యెడల ఈక్రింది అడ్రస్సుకు తెలిపి తగిన పారితోషికం పొందగలరు.

**Sk. మస్తాన్ వలి,** B.A., LLB., న్యాయవాది, టైలర్స్ కాలనీ, నెల్లూరు సిటీ.
సెల్: **90000 65341, 99853 03856**

**మద్రాసులోని హైకోర్టు న్యాయస్థానములో**
**(టెస్టమెంటరీ మరియు ఇంటిస్టేట్ అధికార పరిధి)**
**ఓ.పి.నెం.590 ఆఫ్ 2022.**
**భారతీయ వారసత్వ చట్టం XXXIX ఆఫ్ 1925.**
**మరియు**
**లేట్ బోడె మురళీ కృష్ణారెడ్డి పురఫ్ మురళీ రెడ్డి గారు వ్రాసిన చివరి వీలునామాలోని విషయముల ప్రకారం**

1. బి.రాధిక,
భర్త లేట్ బోడె మురళీకృష్ణారెడ్డి పురఫ్ మురళీ రెడ్డి.
2. బోడె విజయకృష్ణారెడ్డి,
తండ్రి లేట్ బోడె మురళీకృష్ణారెడ్డి పురఫ్ మురళీ రెడ్డి
- 1,2 వారలు నెం.165రు, యఫ్-బ్లాక్, 5వ వీధి, అన్నా నగర్, చెన్నై - 600 102.
3. సోనిత రెడ్డి,
భర్త అరవింద్ బాబు,
తండ్రి లేట్ బోడె మురళీకృష్ణారెడ్డి పురఫ్ మురళీ రెడ్డి,
ఫ్లాట్ నెం.7062రు, బ్లాక్ నెం.07రు,
ప్లాటిన అప్పుసామి అపార్ట్‌మెంట్,
పొన్నమళై రోడ్డు, పోరూర్, చెన్నై - 600 116.
- పిటీషనర్స్.

Vs

బోడె విజయలక్ష్మి,
భర్త లేట్ బోడె వెంకట కృష్ణారెడ్డి పురఫ్ వెంకటకృష్ణయ్య,
నెం.6/75రు, న్యూ నెం.6/31రు, పప్పుల వీధి, స్టోన్‌హౌస్‌పేట, నెల్లూరు నగరం, ఆంధ్ర ప్రదేశ్ - 524 002.
- ప్రతివాది.

టు
బోడె విజయలక్ష్మి,
భర్త లేట్ బోడె వెంకట కృష్ణారెడ్డి పురఫ్ వెంకటకృష్ణయ్య,
నెం.6/75రు, న్యూ నెం.6/31రు, పప్పుల వీధి, స్టోన్‌హౌస్‌పేట, నెల్లూరు నగరం, ఆంధ్ర ప్రదేశ్ - 524 002.

శ్రీ లేట్ బోడె మురళీకృష్ణ రెడ్డి పురఫ్ మురళీ రెడ్డి గారు లోగా తే28.12.2018దిన నాటి వీలునామా లెటర్స్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ మంజూరు కోసం పైన పేర్కొన్న పిటిషనర్లు మీపై పిటీషన్ దాఖలు చేసివున్నారు. కావున మీరు తే28.02.2023దిన ఉదయం 10.30 గంటలకు మద్రాసు హైకోర్టు న్యాయస్థానం ఒరిజినల్ సైడ్‌లోని లెర్డ్ మాస్టర్ ఎదుట వ్యక్తిగతంగా గాని లేదా మీ ప్లీడరు ద్వారా తప్పకుండా హాజరుకావాలని మీకు యిందుమూలంగా సూచిస్తున్నాము. లేనియెడల మీరు హాజరుకానిపక్షములో యీ విషయంపై నిర్ణయం తీసుకొనుదురని యిందుమూలముగా మీకు తెలియపరచుచున్నాను.

కె.బాలాజీ
పిటీషనర్ల తరపున
నెం.366, న్యూ అడిషినల్ లా ఛాంబర్స్,
మద్రాసు హైకోర్టు బిల్డింగ్స్, చెన్నై - 600 104.